ఎన్నికల బరిలో 140 మంది

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ


ఆర్ఓ విక్టర్‌తో సమావేశమైన ఉపసంహరణ అభ్యర్థులు

చార్మినార్: చార్మినార్ శాసనసభ నియోజకవర్గం–66 లో నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఫైనల్ గా 14 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని బుధవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న తెలిపారు. నామినేషన్ల పరిశీలన అనంతరం ఉపసంహరణలు కాలేదన్నారు. ఫైనల్‌గా ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులను కేటాయించామన్నారు. ప్రస్తుతం చార్మినార్ ఎన్నికల బరిలో మజ్లిస్ పార్టీ అభ్యర్థి మీర్ జుల్ఫీకర్ అలీ, బీజేపీ అభ్యర్థి మెఘారాణి, బీఆర్ఎస్ అభ్యర్థి మహమ్మద్ సలావుద్దీన్ లోధీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహమ్మద్ ముజీబుల్లా షరీఫ్ తదితర ప్రధాన పార్టీల అభ్యర్థులు పాటు ఇతరులు ఉన్నారు.

చాంద్రాయణగుట్ట బరిలో 14 మంది..

చాంద్రాయణగుట్ట శాసనసభ నియోజకవర్గంలో ప్రస్తుతం 14 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి సూర్యప్రకాష్ తెలిపారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో మొత్తం 21 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేయగా.. ఇందులో నలుగురు అభ్యర్థుల దరఖాస్తులు తిరస్కరణ గురయ్యాయని.. ముగ్గురు అభ్యర్థులు దరఖాస్తులను ఉపసంహరించుకున్నారన్నారు. దీంతో ప్రస్తుతం ఎన్నికల బరిలో 14 మంది ఉన్నారని ఆర్వో సూర్య ప్రకాష్ తెలిపారు. మజ్లిస్ పార్టీ అభ్యర్థి అక్బరుద్దీన్ ఒవైసీ, బీజేపీ అభ్యర్థి కొడి మహేందర్, కాంగ్రెస్ అభ్యర్థి బోయ నరేష్, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సీతారాం రెడ్డి తదితరులు ఎన్నికల బరిలో ఉన్నారు.

బహదూర్‌పురా బరిలో 12 మంది..

బహదూర్‌పురా శాసనసభ నియోజకవర్గంలో బుధవారం ఎలాంటి నామినేషన్ల ఉపసంహరణ లేదని సంబంధిత రిటర్నింగ్ అధికారి దశరథ్ సింగ్ తెలిపారు. దీంతో ఇక్కడి నుంచి 12 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారన్నారు. ఎంఐఎం పార్టీ అభ్యర్థి మహమ్మద్ ముబీన్, బీజేపీ అభ్యర్థి వై.నరేష్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేష్ కుమార్, బీఆర్ఎస్ అభ్యర్థి మీర్ ఇనాయత్ అలీ బాక్రి తదితరులు ఎన్నికల బరిలో ఉన్నారన్నారు.

యాకుత్‌పురా బరిలో 27 మంది..

యాకుత్‌పురా శాసనసభ నియోజకవర్గం నుంచి 27 మంది అభ్యర్థులు ప్రస్తుతం ఎన్నికల బరిలో ఉన్నారని సంబంధిత రిటర్నింగ్ అధికారి వెంకటచారి తెలిపారు. బుధవారం నియోజకవర్గంలో ఎలాంటి ఉపసంహరణలు జరగకపోవడంతో 27 మంది ఎన్నికల బరిలో ఉన్నారన్నారు. ఎంఐఎం అభ్యర్థి జాఫర్ హుస్సేన్ మిరాజ్, బీజేపీ అభ్యర్థి వీరేందర్యాదవ్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రవిరాజ్, బీఆర్ఎస్ అభ్యర్థి ఎస్ ఎస్ రెడ్డి తదితరులు ఎన్నికల బరిలో ఉన్నారన్నారు.

కార్వాన్ బరిలో 18 మంది..

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గం ఎన్నికల బరిలో 18 మంది అభ్యర్థులు మిగిలారు. నామినేషన్ ఉపసంహరణకు బుధవారం చివరి రోజు కావడంతో ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్‌లను ఉపసంహరించుకున్నారు. ప్రస్తుతం మజ్లిస్, బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను కలుపుకొని మొత్తం 18 మంది అభ్యర్థులు రంగంలో మిగిలారు.

నాంపల్లి బరిలో 34మంది..

నాంపల్లి: నియోజకవర్గంలో మొత్తం 34 మంది అభ్యర్థులు బరిలోకి దిగనున్నారు. ఎమ్మెల్యే స్థానాన్ని భర్తీ చేయడానికి ఈనెల 10వ తేదీ వరకు 56 మంది నామినేషన్లు వేశారు. ఈనెల 13న జరిగిన స్క్రూటినీలో 17 మంది దరఖాస్తులు తిరస్కరించగా, 34 మంది దరఖాస్తులను రిటరింగ్ అధికారి లావణ్య అంగీకరించారు. వీటిలో ఈ నెల 15వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఉండగా ఒకరు కూడా ఉపసంహరించుకోలేదు. దీంతో 34 మంది అభ్యర్థులకు గుర్తులను కేటాయించనున్నారు.

గోషామహల్ బరిలో 21 మంది..

అబిడ్స్: గోషమహల్ నియోజకవర్గంలో 21 మంది బరిలో మిగిలారు. మొత్తం 24 మంది అభ్యర్థులు ఉండగా అందులో ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. బీఆర్ఎస్ నుంచి నందకిషోర్ వ్యాస్ బిలాల్, బీజేపీ నుంచి రాజాసింగ్, కాంగ్రెస్ నుంచి మొగిలి సునీతారావు తోపాటు మరో 18 మంది ఎన్నికల బరిలో మిగిలారు. ముగ్గురు ఉపసంహరించుకోవడంతో 21 మంది బరిలో ఉన్నట్లు ఆర్ఓ విక్టర్ వెల్లడించారు.

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం


ప్రచారంలో పులిపాటి రాజేశ్‌కుమార్

చార్మినార్: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయమని బహదూర్‌పురా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పులిపాటి రాజేశ్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన తన అనుచరులు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో కలిసి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి ఈ ఎన్నికల్లో తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత రాజకీయాలకు దూరంగా ఉంటున్నందున హిందూ, ముస్లిం అనే తారతమ్యం లేకుండా తమ పార్టీకి మద్దతు తెలియజేస్తున్నారన్నారు.

నియామకం


కె.వెంకటేశ్

గౌలిపురా: అదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్తగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కె.వెంకటేశ్ నియమితులయ్యారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశా రు. బాధ్యతలు అప్పగించినందుకు టీపీపీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్‌కు వెంకటేశ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

'కాంగ్రెస్ వెంటే తెలంగాణ ప్రజలు'


కాంగ్రెస్ నాయకుల సమావేశంలో కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: తెలంగాణ ప్రజలు నేడు కాంగ్రెస్ వెంటే ఉన్నారని ఆ పార్టీ కార్వాన్ సీనియర్ నాయకుడు కురాకుల కృష్ణ అన్నారు. బుధవారం కార్వాన్ బంజావాడిలో కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రచార కమిటీ నాయకుడు మధుయాష్కీగౌడ్ ఇంటిపై జరిగిన దాడులను ఖండించారు. ఈ సందర్భంగా కురాకుల కృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో తమ ఓటమి ఖాయమని సీఎం కేసీఆర్‌కు తెలిసిపోయిందని అన్నారు. కాంగ్రెస్ నాయకుల మనోస్థైర్యాన్ని దిగజార్చాలని చూస్తున్న సీఎం కేసీఆర్ పూర్తిగా హేయమైన చర్యలకు పాల్పడుతున్నారని ఆయన అన్నారు. కేసీఆర్ ఎన్ని కుయుక్తులు పన్నినా కూడా కాంగ్రెస్‌ను అధికారంలోకి రాకుండా చేస్తున్న ప్రయత్నాలు విఫలమవుతున్నాయని ఆయన అన్నారు.

'కార్వాన్‌లో బీజేపీ ఆటలు సాగవు'


ఎన్నికల ప్రచారంలో మజ్లిస్ అభ్యర్థి కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో ప్రజలంతా కలిసిమెలిసి ఉంటూ శాంతియుతంగా జీవనం కొనసాగిస్తున్నారని కార్వాన్ సిట్టింగ్ ఎమ్మెల్యే, మజ్లిస్ అభ్యర్థి కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో పాదయాత్ర చేసి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరోసారి తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. నియోజకవర్గంలో ప్రజల మధ్య విద్వేషాలు పెట్టి మజ్లిస్ పార్టీని ఓడించడానికి బీజేపీ అన్ని రకాల ప్రయత్నాలు చేస్తుందని ఆయన అన్నారు. ఆయన వెంట నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు హారూన్‌ఫరాన్, మహ్మద్ ఖదీర్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


అబిడ్స్‌లో ప్రచారం చేస్తున్న సునీతారావు

అబిడ్స్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి మొగిలి సునీతారావు అన్నారు. బుధవారం అబిడ్స్, నేతాజీనగర్, ఖరిమాబాగ్ పరిసర ప్రాంతాల్లో ఆమె ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలతోనే అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరిస్తున్నారన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు కేవలం అసత్య ప్రచారాలు చేస్తున్నాయన్నారు. పదేళ్లుగా గోషామహల్‌లో ఎలాంటి అభివృద్ధి చేయని రాజాసింగ్‌ను చిత్తుగా ఓడిస్తామని ఆమె పేర్కొన్నారు.

నేడు మరోసారి పరిశీలించనున్న నిపుణుల బృందం

నాంపల్లి: బజార్‌ఘాట్‌లోని బాలాజీ అపార్ట్‌మెంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదం ఘటనపై జేఎన్టీయూ నిపుణుల బృందం సమర్పించాల్సిన నివేదిక మరింత ఆలస్యం కానుంది. సోమవారం బజార్‌ఘాట్‌లోని బాలాజీ అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం సంభవించి తొమ్మిది మంది సజీవ దహనమైన ఘటన పాఠకులకు తెలిసిందే. అగ్ని ప్రమాదానికి గురైన అపార్ట్‌మెంట్‌ను కూల్చివేయాలా? వద్దా..! అనే అంశంపై జీహెచ్ఎంసీ అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఇందులో భాగంగానే అపార్ట్‌మెంట్‌ను పరిశీలించి తగు నివేదికను అందజేయాలని కోరుతూ జేఎన్టీయూకు వెంటనే లేఖను రాసింది. జీహెచ్ఎంసీ విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని మంగళవారం సాయంత్రం బజార్‌ఘాట్‌లోని అపార్ట్‌మెంట్‌ను జేఎన్టీయూ బృందం పరిశీలించింది. మెహిదీపట్నం సర్కిల్–12 సిటీ ప్లానర్ రంజిత్ కుమార్ నేతృత్వంలో జేఎన్టీయూకు చెందిన ఐదుగురు సభ్యుల బృందం సుమారు గంటసేపు అపార్ట్‌మెంట్‌ను పూర్తిగా పరిశీలన చేసి బుధవారం నివేదికను సమర్పిస్తామని చెప్పింది. అయితే నివేదిక కోసం జీహెచ్ఎంసీ అధికారులు ఎదురు చూసినా జేఎన్టీయూ నుంచి ఎలాంటి నివేదిక అందలేదు. పైగా మరోసారి అపార్ట్‌మెంట్‌ను పరిశీలించాలని జేఎన్టీయూ నిపుణుల బృందం జీహెచ్ఎంసీ అధికారులకు బుధవారం సాయంత్రం ఒక సందేశాన్ని పంపింది. దీంతో గురువారం మరోసారి బజార్‌ఘాట్‌కు జేఎన్టీయూ నిపుణుల బృందం రానుంది.

రేపు కార్తీక దీపోత్సవం

డబీర్‌పురా: భారత నవయుగ సమాజం ఆధ్వర్యంలో ఈనెల 17న సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కార్తీక దీపోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ దీపోత్సవ కార్యక్రమానికి స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత



గౌలిపురా: తప్పిపోయిన బాలుడిని భవానీనగర్ పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టాకు చెందిన ఫైజల్ హుస్సేన్ (3) మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తప్పిపోయాడు. అనంతరం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.రవీందర్, ఎస్సై దామోదర్, క్రైమ్ సిబ్బంది స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బాలుడి ఆచూకీ కోసం వెతకగా షాజహాన్ హోటల్ సమీపంలో తప్పిపోయిన బాలుడు కనిపించాడు. దీంతో బాలున్ని పోలీసులు స్టేషన్‌కు తరలించి కుటుంబసభ్యులను పిలిపించి వారికి అప్పగించారు.

నాంపల్లిలో మరో అగ్ని ప్రమాదం

నాంపల్లి: నాంపల్లిలో మరో అగ్ని ప్రమాదం సంభవించింది. బుధవారం తెల్లవారుజామున ఏక్‌మినార్ మసీదు సమీపంలోని అనీసుల్ గుర్బా అనాథ శరణాలయం పక్కన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న గూడ్స్ ఆటోలో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కొందరు యువకులు అప్రమత్తమై అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వెంటనే వచ్చిన ఫైరింజన్ సాయంతో మంటలను అదుపులోనికి తెచ్చారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. పక్కనే మైనార్టీలకు చెందిన విద్యార్థి వసతి గృహం, ప్రైవేట్ హోటల్ ఉన్నాయి. సోమవారం బజార్‌ఘాట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో 9 మంది మృతి చెందారు. ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఈ ఘటన మరువక ముందే ఈ ప్రమాదం జరగడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు,

డీసీఎం ఢీకొని వృద్ధుడి మృతి

సంతోష్‌నగర్: సైకిల్‌పై రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని డీసీఎం వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయిబాబా ఆలయం వద్ద నుంచి బుధవారం మధ్యాహ్నం ఓ వృద్ధుడు (70) సైకిల్‌పై సాగర్ రోడ్డుపై వెళుతున్నాడు. అదే సమయంలో వేగంగా వచ్చిన డీసీఎం వృద్ధుడిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కంచన్‌బాగ్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

నాంపల్లి: నియోజకవర్గంలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను బుధవారం ఎన్నికల అధికారులు పరిశీలించారు. ఆయా స్టేషన్లలో నెలకొన్న పరిస్థితులు, పరిసరాల ప్రభావాలను సమీక్షించారు. నియోజకవర్గంలో 277 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. వీటిలోని సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల పరిధిలోని ఎన్నికల ఏజెంట్లు, వారి నేపథ్యంపై దృష్టిసారించారు. అంతే కాకుండా ఈసారి రిగ్గింగ్ జరిగే అవకాశాలు ఉన్నాయా? ఉంటే రిగ్గింగ్ పాల్పడే వ్యక్తులు ఎవరు? వారికి సహకరించే వ్యక్తుల చరిత్రను ఏమిటి? ఆయా కేంద్రాల పరిధిలో రౌడీషీటర్లు ఎంత మంది ఉంటారు? వారు ఇప్పుడెక్కడున్నారు? వీరిలో చురుగ్గా ఉండేవారెవరు? వారి ప్రభావం ఎంత ఉంటుందనే కోణంలో కూడా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సాధారణ ఎన్నికల పరిశీలకులు మహ్మద్ ఇక్బాల్, పోలీసు పరిశీలకులు రాహుల్ నాయర్, వెస్ట్‌జోన్ డీసీపీ, ఆసిఫ్‌నగర్ ఏసీపీ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పేరిణి నృత్యం


నృత్యగురువులను సన్మానిస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో నటరాజ కళా కృష్ణ నృత్యజ్యోతి అకాడమీ ఆధ్వర్యంలో పేరిణి నాట్య గురు శిష్య పరంపర కార్యక్రమాన్ని బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పేరిణి నృత్య కళాకారుల నాట్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రంలో పుట్టి ప్రపంచ వ్యాప్తంగా పేరిణిని విస్తరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం పలువురు నాట్యగురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు ఆచార్య పాండురంగారావు, రచయిత్రి సుందరంవల్లి శ్రీదేవి, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళాకృష్ణ, సంస్థ వ్యవస్థాపకులు గజ్జెల నవ్యజ, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీర్‌చౌక్‌లో ఫ్లాగ్‌మార్చ్


ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న పోలీసులు

డబీర్‌పురా: అసెంబ్లీ ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ పోలీసులకు పూర్తిగా సహకరించాలని మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ రాచకొండ రవీందర్ అన్నారు. ఎన్నికలను పురస్కరించుకొని మంగళవారం రాత్రి మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన ఎస్సైలు, సిబ్బంది, కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవచ్చునన్నారు. ఎన్నికల సందర్భంగా రౌడీషీటర్లు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూదని..ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలన్నారు.

సంక్షేమాన్ని చూసి.. పట్టం కట్టండి



చాంద్రాయణగుట్ట: సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని ఆ పార్టీ చాంద్రాయణగుట్ట అభ్యర్థి ముప్పిడి సీతారాంరెడ్డి అన్నారు. ఉప్పుగూడ డివిజన్‌లో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కేసీఆర్ కిట్, దళితబంధు పథకాలతో ప్రజల హృదయాలను చూరగొన్నారన్నారు. తనను గెలిపిస్తే చాంద్రాయణగుట్టను అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. శ్రీనివాస్, రామచంద్రం, జమ్మిచెట్టు రాజు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



చార్మినార్: భాగ్యలక్ష్మి అమ్మవారి దర్శనానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. దీపావళిని పురస్కరించుకొని అమ్మవారిని బుధవారం పలువురు అధికార, అనధికార ప్రముఖులతో పాటు అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మల్యాల మధుసూదన్ యాదవ్ దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకలు 15వ తేదీ వరకు కొనసాగనున్నట్లు ఆలయ ట్రస్టీ శశికళ తెలిపారు.

జయరాజ్ యాదవ్ నామినేషన్ ఉపసంహరణ



అబిడ్స్: గోషామహల్ బీజేపీ అభ్యర్థి ఎమ్మెల్యే రాజాసింగ్‌కు మద్దతుగా ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేసిన సీనియర్ టీడీపీ నాయకుడు జయరాజ్ యాదవ్ తమ నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. బుధవారం అబిడ్స్‌లోని గోషామహల్ రిటర్నింగ్ అధికారి విక్టర్ వద్ద రాష్ట్ర బీజేపీ ఎస్సీమోర్చా ఉపాధ్యక్షుడు భీశ్వ ఓంప్రకాష్‌తో కలిసి జయరాజ్ యాదవ్ నామినేషన్ ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించారు. అనంతరం ధూల్‌పేట్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఓంప్రకాష్‌తో పాటు జయరాజ్ యాదవ్ సమావేశమయ్యారు. ఓంప్రకాష్ ప్రోత్సాహంతోనే తాను నామినేషన్ ఉపసంహరించుకుని ఎమ్మెల్యే రాజాసింగ్‌కు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. రాజాసింగ్ మాట్లాడుతూ.. 25 ఏళ్లుగా సీనియర్ టీడీపీ నాయకుడు ప్రజల్లో మంచి గుర్తింపు పొందిన జయరాజ్ యాదవ్ బీజేపీకి మద్దతు ప్రకటించడంతో బీజేపీకి కొండంత బలం చేకూరిందన్నారు.

స్వచ్ఛమైన పాలన కోసం బీజేపీని గెలిపించండి


ప్రచారంలో లేగదూడెకు గడ్డి తినిపిస్తున్న బీజేపీ అభ్యర్థి అమర్‌సింగ్


గోల్కొండ: స్వచ్ఛమైన పాలన కోసం బీజేపీనే గెలిపించాలని ఆ పార్టీ కార్వాన్ నియోజకవర్గం అభ్యర్థి టి.అమర్‌సింగ్ అన్నారు. బుధవారం ఆయన నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. పదేళ్లల్లో కార్వాన్ నియోజకవర్గం ఎక్కడి గొంగడి అక్కడే అన్నట్లుగా ఉండిపోయిందని అన్నారు. మజ్లిస్ పార్టీ కేవలం తన స్వార్థం కోసమే పని చేస్తూ పబ్బంగడుపుకుంటుందని ఆయన ఆరోపించారు. సునీల్‌యాదవ్, యోగ్‌రాజ్‌సింగ్ తదితరులున్నారు. ప్రచారం సందర్భంగా ఆయన ఆవులకు వాటి దూడెలకు పచ్చగడ్డి తినిపించారు.

పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయండి


రామకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

అబిడ్స్: ఉద్యోగుల బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, పెండింగ్ డీఏలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావుకు టీఎన్జీఓ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, ఎం.సత్యనారాయణగౌడ్, హైదరాబాద్ జిల్లా టీఎన్జీఓస్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ వినతిపత్రం అందజేశారు. వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులు, డీఏలను విడుదల చేసి ఉద్యోగులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పర్వతాలు, గడ్డం జ్ఞానేశ్వర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణరావు సానుకూలంగా స్పందించి అతిత్వరలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

వంధ్యత్వ సమస్యను అధిగమించాలి



గోల్కొండ: సంతానలేమితో బాధ పడే వారు ముందుగా వంధ్యత్వ సమస్యను అధిగమించాలని ప్రముఖ ఐవీఎఫ్ నిపుణురాలు డాక్టర్ వి.కీర్తన అన్నారు. మంగళవారం టోలిచౌకీ వయాసిస్ ఫెర్టిలిటీలో ఐవీఎఫ్ ద్వారా గర్భందాల్చిన కాబోయే తల్లులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశంలో 28 మిలియన్ల జంటలు సంతాన లేమితో బాధపడుతున్నారన్నారు. వీరిలో కేవలం మూడు శాతం మంది మాత్రమే ఐవీఎఫ్ గురించి తెలుసుకొని సంతానోత్పత్తి సహాయం తీసుకుంటున్నారన్నారు. అనంతరం వయాసిస్ ఫెర్టిలిటీ సెంటర్‌లో ఐవీఎఫ్ ద్వారా గర్భందాల్చిన మహిళలతో సెంటర్ వైద్యులు, సిబ్బంది సహపంక్తి భోజనం చేశారు.

జియాగూడలో మిత్రకృష్ణ ప్రచారం


కొబ్బరి బోండం కొట్టి ఓటును అభ్యర్థిస్తున్న మిత్రకృష్ణ

జియాగూడ: కేసీఆర్ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి లబ్ధి చేకూర్చాయని కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అన్నారు. బుధవారం జియాగూడలోని దుర్గానగర్, కార్గిల్‌నగర్, న్యూ గంగానగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు.

'తెలంగాణకు మంచి రోజులు వస్తాయి'


ఉస్మాన్ బిన్ మహ్మద్ హాజిరి

గోల్కొండ: తెలంగాణలో జరిగే అసెంబ్లీ ఎన్నికలతో పాలక బీఆర్ఎస్ పార్టీ అడ్రస్ గల్లంతవ్వడం ఖాయమని దీంతో తెలంగాణకు మంచి రోజులు వస్తాయని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఉస్మాన్ బిన్ మహ్మద్ హాజిరి అన్నారు. బుధవారం ఆయన కార్వాన్‌లోని పలు బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను తెలంగాణ ప్రజలు ఆదరిస్తున్నారని, కేసీఆర్ అవినీతి పాలనతో ప్రజలు విసిగెత్తిపోయారని ఆయన అన్నారు.

'పాతబస్తీలో మజ్లిస్ పార్టీకి ధోకా లేదు'


మహ్మద్ ముబిన్‌ను సత్కరిస్తున్న రాజేశ్వర్‌రావు, దీపేష్ రాజ్ వర్మ

చార్మినార్: పాతబస్తీలో మజ్లిస్ పార్టీకి ఎలాంటి ధోకా లేదని.. బహదూర్‌పురాతో పాటు అన్ని నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని సీనియర్ మజ్లిస్ పార్టీ నాయకులు ఆర్.రాజేశ్వర్ రావు, మజ్లిస్ పార్టీ యువజన నాయకులు ఆర్.దీపేష్ రాజ్ వర్మ ధీమా వ్యక్తం చేశారు. బహదూర్‌పురా మజ్లిస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ ముబీన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. వారు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఏ పార్టీతో మజ్లిస్ పార్టీ అభ్యర్థి పోటీ ఉండదని.. ఇక్కడ వన్ సైడ్ ఓటింగ్ ఉంటుందన్నారు.

'గెలిపిస్తే అభివృద్ధి చేస్తా'


ప్రచారంలో బీజేపీ అభ్యర్థి నరేష్

చార్మినార్: పాతబస్తీలో తమ పార్టీ ఇప్పటికే పటిష్టంగా ఉన్నందున ఈ ఎన్నికల్లో తమ విజయం సునాయసంగా మారుతుందని బహదూర్‌పురా నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి వై.నరేష్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బుధవారం పంచాలింగాల బస్తీ, పార్థివాడ, పూల్‌బాగ్ చమన్ తదితర ప్రాంతాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి కాలినడకన తిరిగి ఈ ఎన్నికల్లో తనే గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే.. నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడతానన్నారు.

'చార్మినార్‌లో విజయం సాధిస్తా'


ప్రచారంలో చార్మినార్ బీజేపీ అభ్యర్థి మెఘారాణి

చార్మినార్: చార్మినార్ నుంచి విజయం సాధించి పార్టీ అధిష్టానానికి బహుమతిగా అందజేస్తానని చార్మినార్ బీజేపీ అభ్యర్థి మెఘారాణి అన్నారు. బుధవారం ఆమె ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచి పెడుతూ ఈ ఎన్నికల్లో తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈసారి బీజేపీకి చార్మినార్ నియోజకవర్గంలో విజయం సాధించడానికి చక్కటి అవకాశాలున్నాయన్నారు. ఉమేష్ సింగానియా, పవన్ మిశ్రా పాల్గొన్నారు.